కథానిక

# వెలుగు నీడలు

డియర్,

చాలా కాలం తర్వాత ఉత్తరం వ్రాస్తున్నందుకు కోపం విపరీతంగా వచ్చినట్లుందే!" అలుక చాలించవే కలువభామా..." అసలు విషయం చెప్పితే నీ కోప స్థాయి ఆఖరి మెట్టును చేరుకుంటుంది. అయినా చెప్పేస్తున్నా అబద్ధాలూ, బడాయి మాటలూ, గొప్పలు చెప్పుకోవడాలూ మన మధ్యలో లేవు కాబట్టి నిజాలు చెప్పేస్తున్నా- ఏం లేదు లే-

అసలీ ఉత్తరం అయినా నీకు వ్రాద్దామని కూర్చోలేదు-

కథ వ్రాద్దామని కూర్చుంటే కలం నీకు ఉత్తరం వ్రాస్తానంది...

సరే కానీయ్ అన్నాను-

"ఇంతకీ ఈ ఉత్తరం వ్రాసింది మా సరోజ కలంగానీ సరోజ కానేకాదు అని అంటున్నావా?" కలం పట్టుకున్నది సరోజ చెయ్యేగదా మరి? అందుకని ఇది నేను వ్రాస్తున్నట్లే లెక్క కిందికి వస్తుంది అన్నమాట!

అయినా నేనేం పెద్ద విశేషాలు వ్రాయ బోవటల్లే-

వెనక నీ విక్కడకు వచ్చినపుడు మా స్నేహితురాలిని గూర్చి చెబుతానంటే కథలంటే ఇష్టంలేని నీవు నన్ను కబుర్లలోకి దింపేశావు! ఇప్పుడు ముఖాముఖీ చెప్పడానికి వీలులేదు కాబట్టి ఇందులో వ్రాసేస్తున్నా..." ఏదైతేనేం. కథ పత్రికకు వ్రాసుకునే బదులు నాకు వ్రాస్తున్నావు" అంటావు - అయినా ఇది నీకు ఏ విధంగానూ పనికిరాదనుకోంటున్నావల్లే ఉంది-

మొన్న నాకు ఉద్యోగంలో ప్రమోషను వచ్చినందుకు నీకు ప్రజెంటు ఏమి పంపలేదుగా? కాబట్టి ఈ కథ నీకు వ్రాస్తున్నా- [నా కెందుకూ అని గదమాయించకు మరి!] దీనిని కొద్దిగా సవరించి అంటే నీ పేరూ, నా పేరూ మార్చి ఏదైనా పత్రికకు పంపుకుంటే ఎంత చప్పు లేదన్నా ఓ ఇరవై అన్నా దొరుకుతాయి!

ఇదేం ట్రాన్సాక్షనూ అని విసుక్కుంటున్నట్లున్నావు- ఇదీ బాంకు పద్ధతిలే-

గవర్నమెంటు వాళ్ళు కనుక అయితే పది పయాపైసల బిళ్ళమీద- అది కొనడానికి డబ్బు మనదే అనుకో - మన దస్కతు తీసుకుని మిగిలిన సొమ్ము చేతుల్లోనో - దోసిట్లోనో - ఒడిలోనో- క్వాంటిటీని బట్టి పోస్తారు.

ఇక బాంకు వాళ్ళంటావా? ఏమిటో- ఒక కాగితం మీద మనకు రావలసిన జీ(వి)తాన్ని అంకెల్లోనూ, అక్షరాల్లోనూ వ్రాసి, దాని మీద

రచన:

## కుమారి పి. లీలా వెంకటాత్రిమ్మ

పదిపైసల బిళ్ళ అంటించి, మన సంతకం దాని మీదే తీసుకుని-

"దీనిని చెక్కు అంటారు! ఇది పట్టి కెళ్ళి కౌంటరు దగ్గర కేష్ చేసికో!!" అంటారు. నీకు అదీ బద్ధకం అయితే ప్యూన్ తెచ్చిస్తాడు రెండు పావులా బిళ్ళలు చేతిలో పడగానే...

"పడిపినట్లుంది..." అని అనేశావూ? ఇంత నేపూ విని...

నీ ఉత్తరానికి డబ్బు లిచ్చే దాతలెవరే? అని కూడా అన్నావా ?

నీకు తెలియదేమో లే- తెలుగు సాహిత్యంలో లేఖా సాహిత్యం చాలా ముందంజ వేసింది! అంటే-కవు లను కుంటూన్న ప్రతివాళ్ళు ఉత్తరాలు వ్రాస్తున్నారు!!

అవి ప్రియురాలిని వర్ణిస్తూ అయితేనేం?

చెల్లెలికి మొదలెట్టి జర్నలిజంతో ముగిస్తేనేం?

వెనక మాకు తెలిసిన ఓ అబ్బాయి కథలు వ్రాసుకుంటూండే వాడు. ఆ కథల్లో చెల్లెళ్ని కన్నతల్లిగానూ, చిట్టిగానూ చూసుకుంటున్నట్లుగా ఉండేవాడు...

నిజానికి బిరబిరలాడి పోయ్యేవాడు చెల్లాయి పేరెత్తితే ఇంట్లో-

కథల్లో మాత్రం ఎంత ఆప్యాయంగా ఉండే వారనీ?

అందుకునేనే- చిట్టి తల్లీ కథలూ - కల్లలు! అని అంటావు నువ్వు ఇదంతా చదివి...

నిజమే అనుకో- కథలకోసం మొదలుపెట్టినా సాహిత్యసేవ అనుకున్నా - అందులో కల్లలున్నాయంటే అర్థముంది- అందమూ ఉంది...

ఇంకా పోతే ఆనందమూ ఉంది...

లేకపోతే పెద్దన హిమాచల ప్రదేశాలన్నీ తిరిగే వచ్చాడా? అదీ- ఊహాలోకపుటంచు- అంది మొన్న నో సుమిత్ర...

సరే - ఏదైతేనేం-

"జరగనివి అందంగా చెప్పగలిగితే- సాహితీమ తల్లి పాదద్వయంమీద నీవుకూడా ఓ పువ్వుని ఉంచగలిగావనుకో..."

ఇంతకీ- నేను కథ కోసమై మొదలు పెట్టలేదు కాబట్టి ఇందులో వన్నీ నిజాలే నేవ్! (సా) గింపుతో నా మాటలు ఎల్లానూ తప్పవుగా? ఇప్పుడు మిగిలినవి అప్పుడు వ్రాస్తాలే-

కథార్థం కాకుండా యథార్థంగా ఉన్నది ఉన్నట్లు తు. చ. తప్పకుండా వ్రాస్తున్నానప్పి, అన్ని కథల్లోని కల్లలూ ఇందులో ఉండవనీ. ఇది నిజంగా జరిగిన కథేననీ- ఇందులో నలిగిపోయిన ప్రాణి సాక్షాత్తూ మొన్న నీకు పరిచయం చేసిన లక్ష్మి అనే అమ్మాయినే అనీ మరోసారి మనవి చేసికొంటూన్నాను అసలు రంగంలోకి దిగే ముందు.

* * *

"లక్ష్మి..." ఇందిర పిలుపు వెనుకనుండి కొట్టొచ్చినట్లుగా వినిపిస్తోంది!

హరమతీ, శారదలతో కలసి వెళ్ళిపోతున్న లక్ష్మి విసురుగా వెక్కిరిస్తున్నట్లు భుజాల్నెగరేసి కెమిస్ట్రీ లాబ్ కేసి సాగిపోనారంభించింది!!

భుజాల కుదుపుకు త్రాచు పడగలా బారెడు జడా ఒక్కసారిగా కదిలిపోయింది. గాలికిలేని సువాసనలు జ్ఞప్తికి తెస్తూ లినే పరిహసించేయి తల్లోని మల్లెలు!

"నాకేం...? ఓ తాయిలారికీ- తాయిలారికీ-" దీర్ఘాలు తీస్తూనే ఉంది వెనకనుండి ఇందిర!!

"ఓ తాయిలారికి ఉత్తర మొచ్చింది దోచ్"

ఉత్తరం మాట వినగానే గిరుక్కున వెను దిరిగింది!

ఆనుకోని అదురుపాటుకు జడ ఊగిసలాడి పోయింది.

అడుగులు గబగబా సాగిపోయాయి.

పెదాలు తమ అశక్తతను తెలియపరుస్తూ నవ్వును దాచుకోలేక విడివడుతున్నాయి...

"ఇటు ఇస్తావా?" అమాయకంగా చెయ్యి చాపి ప్రశ్నించింది. అర్థిస్తున్నట్లు లక్ష్మి!

చాచిన చెయ్యికేసి వెక్కిరింతగా చూస్తూ, "ఉత్తరం అంటేనేగానీ- దావనీ- అంతకుమించి మరేంలేదు." నసుగుతోంది ఇందిర!!

"ఇందూ - ఇది ఆటలాడే సమయంకాదు-" లక్ష్మి మొహంలో తీవ్రత తచ్చాడబోయి పారిపోయింది, పరిహాసం తొంగిచూస్తుంటే పెదవుల మధ్య నుండి!

"అవునవును.... సాయంకాలంగదూ మనం ఆటలాడుకునేది!" ఆశ్చర్యాన్నభినయించేయి చక్రాల్లాంటి ఇందిర కళ్ళు!

చివరకు పదిచేతులు మారి- పదిపైసల స్టాంప్ ఎక్స్ట్రాగా అంటించిన కవరొకటి అర్ధగంటకు లక్ష్మి చేతిలో పడింది.

ఫ్రమ్ అడ్రెస్ కేసి చూసుకుని, నవ్వుకుని తల వంకించుకుంటూ,

"ఏ పని... ప్రిన్సిపాల్ తో... రేపు..." సిగ్గు సిగ్గుగా అంది లక్ష్మి...

"రేపేం ఖర్మ... ఇవ్వాళే- ఇప్పుడే... ఊఁ..." నవ్వుతూ హిస్టరీ క్లాసుకు వెళ్ళిపోయింది ఇందిర...

విప్పి చదవాలని విపరీతంగా అనిపిస్తున్నా సమయా సమయాలకోసం కాచుకొని ఉండాలని పాపం - దిగులుగా వెళ్ళిపోయింది లక్ష్మి...

లక్ష్మి అంటే గాజుల గలగలలూ- నవ్వూ-కొంటితనం, చిలిపితనం మేళవించి దిద్దిన ఆకారం అన్నమాట!!!

* * *

ఆ రోజు ఆదివారం...

శలవురోజు కావటం వలన హాస్టలులోని ఆడపిల్లలు కేరింతాలు కొట్టుకుంటూ అంతా ఒకచోట గుమిగూడి నవ్వుకుంటున్నారు.

ఇవ్వేళ బుద్ధిమంతుల విషయం వద్దుగానీ- అల్లరి పిల్లల విషయం ముచ్చటించుకోదలిస్తే కనుక ఓసారి లక్ష్మి గదిని పరికించి తీరాలి...

పెద్దక్లాసనీ- రికమెండేషనులద్వారా ప్రైవేటు రూము లక్ష్మి ఎందుకు సంపాదించిందో ఎవ్వరికీ అర్థమవలేదు!

కేంప్ కాట్ మీద బోర్లా పడుకుని పాదాలని ఒకదానికొకటి తాటిస్తూ వచ్చిన అల్లరి మూకకి ఒక్కొక్క కుర్చీయే చూపించింది లక్ష్మి అల్లరిగా నవ్వుతూ!!

ఒక్కొక్క కుర్చీని పట్టుకొని ఇద్దరు ముగ్గురు వేళ్ళాడుతున్నారు. డ్రాయర్లమీద నలుగురైదుగురు సర్దుకుంటున్నారు. కిటికీలలో కూర్చుని వాటా లేసుకుంటున్నారో ముగ్గురు- లక్ష్మి ప్రక్కనే ఆ చిన్న మంచంమీద సర్దుకో ప్రయత్నిస్తున్నారు మరి కొందరు...

"అచ్చా... ఇవ్వాళ్టి ప్రోగ్రాము ఏమిటట?" నాయకి - లక్ష్మి ప్రశ్నించింది.

"నిర్ణయించాల్సిన బాధ్యతకూడా నీదే." బాధ్యత అంతా లక్ష్మి భుజస్కంధాలమీద పడవేశారు అందరూ కలసి కట్టుగా!! "ఉహూఁ సరే- ఇవేళ..." ఏదో విషయాన్ని లక్ష్మి చెప్పేలోగా హాస్టలు వార్డెను "ఏమిటీ గందరగోళం అని" లక్ష్మి రూములోకి ప్రవేశించేసరికి ఎక్కడి ప్రాణాలక్కడే అంటుకొనిపోయాయి. అందరికంటె ముందుగానే తేరుకున్న లక్ష్మి," ఈవేళ నా పుట్టిన రోజండీ... మీకు చెప్పడం మరచేపోయ్యాను... వాసంతి డాన్సు ప్రోగ్రాం ఒకటి ఇస్తుందిట ఈ సందర్భంలో- సుమతి రెండు పాటలు పాడుతుందిట.... నీరజ మమ్మల్నందరినీ సినీమాకు తీసుకెడుతుందిట- సుమబాల టాజ్ హోటలో పెద్ద పార్టీ ఇస్తుందిట..." మధ్యలో వార్డెను కలుగజేసుకోబోతే- లక్ష్మి ఇంకో నలుగురైదుగురిని రచ్చ కెక్కించి ఏడ్పించేనదే. ఇక్కడికి పైనలుగురికీ పై ప్రాణాలు పైకే ఎగిరిపోయ్యాయి! వార్డెను రక్షించినందుకు ఎంత తిట్టుకున్నా ఆవిడను లోలోన అభినందించేరు మిగిలిన వాళ్ళంతా

ఓడిపోయిన మొహంపెట్టి "మరి - తెమలండి ఏమిటీ గొడవ-" అంది ఏమనాలో తెలియని వార్డెను!

"ఆల్ రైటు - మీరు కూడా మాకు వీటన్నిటికీ గెస్టు సుమా-' వి జ య సూ చ కం గా నవ్వింది లక్ష్మి. ఓడిపోయిన కోడి మొహం పెట్టిన వారెనును అనుకరిస్తూ ఆమె వెనకాల దాక్కుని!

నవ్వాపుకోలేక సతతమై పోయిందామె మిత్ర బృందం.

"ఇదేమీ మంచిగా లేదు లక్ష్మి- నీ చదువుకని నీవు వేరే రూము తీసికున్నావు- చదవడానికి తప్ప మిగతా అన్నింటికీ ఉపయోగిస్తున్నావు నీ టైముని!" మెల్లి మెల్లిగా విసుక్కుంటూ వెళ్ళిపోయింది వార్డెను.

వెర్రి మొహాలు వేసిన సుమబాలనీ, నీరజనీ చూసి-" మీ పర్సులేమీ ఖాళీ చెయ్యనక్కరలేదు బంగారు పడకండి- ఏదో మీ పేరు చెప్పి నేనే

(తరువాయి 28 వ పేజీలో)




చిత్రకారుడు : టి. జయదేవ్

# వెలుగు నీడలు

(10 వ పేజీ తరువాయి)

మీఅందరినీహోటలుక్కి సినిమాకీ తీసికెళ్తాను. ఇక వాసంతి- సుమతిల విషయ మంటారా- వాళ్ళిష్టం అసలు విషయం ఇవేళ నా పుట్టినరోజు కానే కాదు-" మిగిలిన మాటలని అందరి నవ్వులూ మింగేశాయి. ..

జీవితం అంటే మూడు పువ్వులూ- ఆరు కాయలూ కాక- ఆరు పువ్వులూ- మూడు వత్ఫ్యాలా సాగిపోతోంది లక్ష్మి విషయంలో... అరుదుగా నుదురు చిట్లించే లక్ష్మికి- అన్ని వేళలా నవ్వుతూండే లక్ష్మి మనస్సులో ఎంత చీకటి ప్రవేశించనుందో ఎవ్వరికీ తెలియనే లేదు- రోజులని నిముషాలుగా గడిపేస్తుంది.

చల్లటి నీటి కొలనులో- చిన్న పిల్లలలా పాదాలని నీటిలో సగం ముంచి విలాసంగా గడిపేసే జీవి లక్ష్మి-

అందుకనే - అందరికీ లక్ష్మి అంటే ఎంతో ఇష్టం!!

అదే లక్ష్మికి గర్వకారణం-

ఇంతమంది తనను ప్రేమిస్తుంటే ఆనందం!!

* * *

బోటనీ గార్డెన్సులో ఓ మూలగా కూర్చుని పరధ్యాన్నంగా గడ్డి పరకలు నములుతూన్న లక్ష్మిని సమీపించింది హారమతి...

వెనకనుండి దొంగచాటుగా కళ్ళుమూసేసింది మైగా...

"అబ్బబ్బ... హారీ.. తియ్యవే చేతులూ" లక్ష్మి విసుక్కోబోయింది.

"మరే- లక్ష్మి- నేనిల్లా మూస్తూంటే మీబావ గుర్తుకు వచ్చేరు కదూ? అయినా నక్క- ఎక్కడా? నాకలోక మెక్కడా?" అని నేను మోటు చేతుల్తో మూస్తే మీ బావ ఎల్లా గుర్తుకు వస్తారులే" అంటూ మెల్లిగా ఆమె భుజాలమీద ఆనుకుని కూర్చుంటూ అంది హారి!

బావ మాట వింటూనే గుబులుగా ఏడ్చేసిన లక్ష్మిని చూసి ఏం చెయ్యాలో తోచని హారమతి నిశ్చేష్టితే అయిపోయింది పది నిముషాలపాటు!

తేరుకుని- "నేను నిన్ను గాయపరిచేనా ఏ విధంగానైనా ?- లక్ష్మి- అసలేం జరిగింది... కొన్ని కొన్ని పేరులు వింటూనే సిగ్గుల భరణిలా దాక్కునే నువ్వు ఎందుకిలా ఏడుస్తున్నావు?" ప్రశ్నించింది దీనంగా హారమతి...

"నా జీవితానికి విలువ పోయిందే హారీ-

ఇక నాకు మిగిలింది చీకటే-

నా జీవితంలో వెలుగులేదు చీకటే తప్ప-

వెన్నెల లేదు- ముసురుకొచ్చే అంధకారం- తప్ప-

నా కిరీటం పడిపోయింది- ఇక నాకేం విలువ- ఆయాసపడుతూ, ఎక్కిళ్ళ మధ్యలో అంది లక్ష్మి-

అనుకోని ఈ అదురుపాటుకి ఉలిక్కిపడింది హారమతి!

"అసలు విషయం తెలియనివ్వకుండా- ఇల్లా మధ్యలో చెప్పి అసంగతంగా ఆపేస్తే నాకేం తెలుస్తుందీ...?"

లక్ష్మి అసలు జవాబు చెప్పే స్థితిలో లేనేలేదు.

"నాకు తెలియనిది ఇన్నాళ్ళా దాస్తున్నావా? ఏమిటసలు?" ప్రశ్న ప్రశ్నలానే ఉండి పోతోంది హారమతికి!

ఖంగారుగా లక్ష్మి భుజాలని ఊపేసింది-

"అసలు విషయం చెప్పకుండా, నా ప్రాణంలో ప్రాణమైన నీవిల్లా ఉంటే నాకేం తోచదు- ఏమి జరిగిందనీ...?" హారి ఖంగారు అలవి కాకుండా ఉంది!!

జలిపేసిన ఓ కాగితం హారమతికి అందిచ్చింది చాలాసేపటికి లక్ష్మి!

ఆతురతగా విప్పేసరికి-

మహాలక్ష్మి సమానురాలైన అక్కయ్యకి,

నమస్కారాలు. నీకు ఎన్నెన్నో మంచి విషయాలని వ్రాయవలసిన నేను, నీ చెల్లెల్నై ఉండీ ఇల్లాంటి ఉత్తరం వ్రాయవలసిన అవసరం వచ్చినందుకు ఎంతో విచారిస్తున్నాను-

అమ్మా, నాన్నలు కులాసే! అసలు విషయం-

బావ, ఓ పోస్టు గ్రేడ్యుయేట్ చదివిన మరో అమ్మాయిని లక్షరూపాయల కట్నంతో స్వీకరించనున్నట్లు గాలివార్తగా తెలిసింది!!

అసలు నీకీ విషయం తెలుసునా?

రేపపెళ్ళిండిల్లో శుభలేఖకూడా వస్తుందిట! నాన్న నీకు మరో మంచి సంబంధం తెచ్చి నెలరోజులలోగా చేస్తానని అమ్మతో అంటుంటే విన్నా- నీ చెల్లి కౌసల్య..."

**P. S.** నీ ఆరోగ్యం జాగ్రత్త సుమా...

నలిగిపోయిన మడతల్లోంచి, ముందుకు వస్తూన్న చీకటి తెరల మధ్యనుంచి చదవ గలిగింది హారమతి!!

చదివి తిరిగి నలిపేసి నిర్ఘాంతపడిపోయి నిశ్చేష్టిత అయింది హారమతి!

"ఒడిదుడుకు లనేవి జీవితంలో చాలా సహజం... మీ వాళ్ళు అసలు సంగతులు తెలియకుండా నేనేదో కామెంటు చేస్తున్నాననుకోకు మీ ఇద్దరికీ పెద్దలు నిశ్చయించలేదా? అది కాని దానికి ఉత్తరాలూ అవీ వ్రాసుకుంటూ ఎందుకింత దూరం రానిచ్చేవ్? జరిగిందేదో జరిగిపోయింది... సముద్రపు పట్టు విరిగి పడే అలల తాకిడికి ఎప్పుడూ సిద్ధంగానే ఉంటుంది... ఇంకేం చెప్పను. అదృష్టవశాత్తూ మాత్రం ఇది జరుగలేదు. రూపాయి కాసుకు రెండు వైపులా ఏముందో చూసి ఉండి ఉండాల్సింది! ఊహించనివి జరిగి ఉండవచ్చు!! అయినా మీ బావ అంత తేలిక తక్కువగా ఒప్పుకున్నారంటే చాలా ఆశ్చర్యంగా ఉంది... మందర హాస్టలుకి నడు భోజన ప్రకరణం ఎన్ని ఆపదలు వచ్చినా అప్పుడా కి వీల్లేదు-అసలు విషయం రాత్రి మాట్లాడుకుందాం..." హారమతి దీర్ఘోపన్యాసాన్ని ముగించి లేచి నిలబడింది,

హారిని ఆసరగా చేసుకుని కుంటుకుంటూ లేచి నిలబడింది యాంత్రికంగా లక్ష్మి!!

హాస్టలు ఆవరణలోనికి అడుగుపెడుతూంటే నిర్లిప్తంగా ఉన్న లక్ష్మి మొహాన్ని చూసి వెల వెలబోతూన్న మిత్రబృందం, దీర్ఘంగా ఆలోచిస్తూన్న హారి మొహం కూడా చూసి నిశ్శబ్దంగా ప్రక్కకి తప్పుకున్నారు!

ఆకతాయి పిల్ల లక్ష్మి పెళ్ళయితే "మౌన వ్రతం" ఒక్కటే పట్టలేనిది అని నిర్వచించుకున్న ఆ హాస్టలులోని పిల్లలందరూ లక్ష్మి మౌన వ్రతాన్ని యథావిధిగా పట్టగలదనీ, నాటకాల్లో పాల్గొంటే సీరియస్ మూడ్సను మార్వలెస్‌గా ప్రదర్శించగలదనీ దిద్దుకున్నారు అంతకు ముందు తామేర్పరచుకున్న అభిప్రాయాల పుస్తకంలో!!!

డైనింగు హాలు ఇవ్వాళున్నంత నిశ్శబ్దంగా ఎప్పుడూ లేదు-నిశ్శబ్దం స్వైరవిహారానికి విశ్రాంత పోయింది ఆ డైనింగు హాలే కొంతసేపటికి-

వంకాయ కూరను చూస్తూనే ఆతురతగా లక్ష్మి మొహాన్ని చూసి "ప్స్" అనుకున్నారు అందరూ!

'నేనో రహస్యం చెప్పనా ?

పాపం... ఈ భారతదేశపు దీన రైతు తప్పు ఉందని నేననటంలేదుగానీ- ఈవిధమైన కూరలు మనం తినవలసినందుకు కారణాన్ని వివరిస్తూన్న కొంచెం కోమటి రహస్యం బావతే అనుకోండి- గట్టిగానే చెప్తాను-

ఈ రైతులేం చేస్తారంటే విత్తనాలకోసమని కొన్ని కాయలను అట్టే పెట్టేస్తారు! అవి సహజంగా రేపు పక్వదశకు వస్తాయనగా, పాపం ఇంట్లో ఏ ఎడపిల్లాడికో జబ్బుచేసి మందూ, మాకూ కొనవలసివస్తుంది.

అప్పుడేం చేస్తాడూ? దొడ్లో కొస్తాడు... నింగికేసి చూస్తాడు దీనంగా బుర్ర గోక్కుంటూ ముందు! తన ప్రోబ్లమ్‌కి సొల్యూషను నింగి మీద గీసి లేదు!! నింగి నుండి మాపులు నేలకి మారే సరికి విత్తనాలుగా మారబోతున్న కాయ గూరలని చూసి తలపంకించుకుంటాడు. నేల మీదే ఈ ప్రోబ్లమ్ సొల్యూ చేసి ఉందే. ఇందాకా అనవసరంగా నింగిని చూస్తూ టైము వేస్టు చేసుకున్నాను అని తన భాషలో అనుకుని, ఓ గోతాం తెచ్చుకుని- అవన్నీ పుణికి ఏ హోటలుకో మరే హాస్టలుకో బయలుదేరి వాళ్ళకి అయిన కాడికి తెగనమ్మి ఆ డబ్బుతో మందు కొనుక్కుని ఇంటికి పోతాడు- ఇక్కడి వరకూ మన ప్రమేయం లేదు- ఇక రైతు- సంగతికూడా మన కనవసరమే అనుకోండి !!

మన దృష్టి ఇంక హోటలులో చేరినవో, హాస్టలులో చేరినవో అయిన వంకాయల వైపు రెండో రోజులలో విస్తనం అయిపోనున్న వంకా యలపై ప్రసరించాలి... అంటే మన దృష్టి ఇప్పుడు మనం తింటున్న వంకాయ కూర పైకి మళ్ళించాలని పాఠాంతరం అన్నమాట... ఈ వంకాయ సంతర్పణ కూరలో ఆ తెల్ల తెల్లగా కనిపించేదంతా కొబ్బరికోరు అనుకుంటున్నారా? ఊహూ విత్తనాలుగా మారిపోతూన్న "వంగనారు" అన్నమాట...ఏమంటావ్ సుబ్బమ్మా..." ఇంతవరకూ లక్ష్మిని ఉపన్యాస కర్త గావించి ఆ తర్వాత తమ నవ్వులకి శ్రోతని కావించే వారు మిగతా పిల్లలు.

ఈ విధంగా రోజూ నవ్వుల పువ్వులతో వెలిగిపోయే ఆ డైనింగు హాలు నేడు వెలవెల బోతోంది-

వంకాయ కూర కూడా లక్ష్మిం హారిలను కదిలించలేక పొయ్యేవరికి వెనకటి కామెంట్సు గుర్తుకు వచ్చిన అమ్మాయి లందరూ "ఔరా!" అని ముక్కున అంటువేళ్ళు ఉంచేసికున్నారు ఆశ్చర్యాంబుధిలో మునిగిపోయి !!!

అందరికంటె ముందస్తుగానే తిండి ప్రకరణం ముగించి ముందు సాగిపోయింది లక్ష్మి-

"నటన అనేది కొంతమందికే పరిమితం హారీ!

అందులోనూ కొంతవరకే ఆ నటన అనేది పనిచేస్తుంది !!

ఆ పైన ఎంత గొప్ప నటుడికైనా దెబ్బ తీయడం అనేది సహజం !!!

నిజానికి ఇంతవరకూ నేను నటించిదేమీ లేనే లేదు-


మీరు నాకా అవకాశమే ఇవ్వలేదు-

ఈనాడు నీకు నా మనస్సులోని హాలాహలా న్నంతటినీ వివరిస్తున్నా- విని పరిస్థితిని అర్థం చేసుకో..."

డాబా పిట్టగోడమీద కూర్చుని కొబ్బరి ఆకుల్ని తుంపుతూ లక్ష్మి చెప్పినదంతా విని నిట్టూర్చింది హారి!

దూరంగా చెట్ల మధ్యనుండి కృష్ణ పక్షం నాటి పాడ్యమి చంద్రుడు కనిపిస్తున్నాడు !!

"ఒకానొకప్పుడు శుక్లపక్షం రోజులు తప్ప కృష్ణ పక్షపు రోజులుంటాయనే సంగతి తెలియదు నాకు! ఈనాడు నాకు కృష్ణపక్షమిరోజులే



ఎక్కువ అని అనిపిస్తుంది!! మా బావని నా కివ్వడం మా మావయ్య కిష్టంలేదు- మేమైతే ఏభై వేలకన్నా కట్నం ఇవ్వలేమని !! అందుకనే లక్షరూపాయల కట్నం ఇవ్వగలిగిన అమ్మాయే ఆయనకి కోడలు అవబోతూంది, తండ్రి నెదిరించలేని అశక్తతతో పుట్టి పెరిగాడు మా బావ! మా అత్తయ్యా ఎప్పుడో స్వర్గం చేరుకుంది- అడ దిక్కులేని సంసారం- మావయ్యకి తట్టింది ఎవరైనా సరే ఆ ఇంట్లో చేసి తీరాలనే నిరంకశత్వం సాగిపోతుంది ఆ ఇంట్లో చివరకి బావ ఒప్పుకుంటాడని నే నెప్పుడూ అనుకోనైనా లేదు- నా జీవితం ఎలానూ చీకటిలోనే గడిచిపోతుంది- అదే నా నుదిటి వ్రాత కూడానూ! కనీసం మా చెల్లెలైనా నా మాదిరి పెడద్రోవని పట్టకుండా చూసుకునే బాధ్యత నా మీద ఉంది-

కనిపెంచిన తల్లి తండ్రులకోసం-

అమాయకమైన చెల్లెలికోసం నేను జీవించ దలచుకున్నా-

నన్ని ప్రేమలోకి మా బావ దింపకుండా ఉండిఉన్నా చాలా సంతోషించే దాన్ని...

ప్రేమంటే తెలియని నాకు అన్నివిషయాలూ చూపించి ఎంతో నిశ్శబ్దంగా ప్రక్కకి తప్పుకుని పోయాడు-ఇందులో ఎవ్వరినీ దూరనక్కరలేదు- నా నుదుటివ్రాత ఇంత చక్కగా వ్రాసినందుకు విధిని అభినందించాలి-"

వేడి వేడి నిట్టూర్పుల మధ్య చెప్పదలచుకున్న విషయాన్ని చాలా క్లుప్తంగా చెప్పింది లక్ష్మి-

ఆ తర్వాత లక్ష్మి కిలకిల లాడుతూ తిరుగాడడం ఎవ్వరూ చూడలేదు. మచ్చలేని తెల్లబట్టలు కట్టుకుని ఎవరికీ కనిపించలేదు - తలనిండా పూవులు ముడుచు కోనేలేదు,

దీర్ఘంగా ఆలోచిస్తున్నట్లుండేది ఆమె కనులు-

నిశ్శబ్దంలో ఎంతో హాయి ఉందనేది ఆమె-

యాంత్రికంగా తన పనులు తాను నెరవేర్చుకుని పొయ్యేది-

సూర్యుడు ఉదయిస్తూన్నట్లే లేచేది విధిగా-

వేళమించకుండా తన పనులు తాను నిర్వర్తించుకుంటూ-

ఏదో శుభ ఘడియకోసం ఎదురుచూస్తున్న దానిలో దూరాన ఉన్న మృత్యువుకోసం ఎంతో ఆశగా ఎదురుచూసేది...

* * *

పి యస్:-

ఇంతకు మించి ఇంకా వ్రాయాలని ఉన్నా నిన్ను నేను బాధపెట్టలేక ఇంక ఆపేస్తున్నానే-

ఆ లక్ష్మినే నేను నీకు పరిచయం చేసింది!

ఈనాడు ఎంత మఖావి అనీ!!

పాపం వాళ్ళ నాన్నగారికి వ్యాపారంలో బాగా నష్టం రావడంవల్ల ఈ ఏడాది ఎగ్జామినేషను ఫీజు కట్టడానికి డబ్బులేక-రెండు వైశ్రి వే ట్లు ఉదుర్చుకుని నానా అవస్థా పడిపోతోంది-దాని జీవితంలో వెన్నెలరోజులు పదీ, చీకటిరోజులు చాలాచాలా ఉన్నట్లున్నాయి...దానిని గూర్చిన ఆలోచన-బాధ-లలో ఇంకేంవ్రాయలేక ముగిం చేస్తున్నా-

కనీసం ఇది అందినట్లు జవాబు వ్రాస్తావు కదూ?

నేను చాలా ఆరోగ్యంగానే ఉన్నానంటాడీ సమయంలో ఏ డాక్టరుచూసినా!

నీ ఆరోగ్యం?

మీ వారిని అడిగేనని చెప్పు-

ఇంతకీ ఈ ఏడాది ఒక చిరంజీవి నందించ దలచుకున్నావా? లేదా?? అబ్బో రోషం వచ్చినట్లుందే-

నెలవ్ మరింక-నీ-సరోజ.